క్లుప్తంగా

సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలి
మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలి అర్బన్: సిల్ట్‌ను పూర్తిస్థాయిలో తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. 33వ వార్డు యడ్లలింగయ్య కాలనీలోని రైల్వేట్రాక్ కింద ఉన్న కాలువ పూడికతీత పనులను శుక్రవారం ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రధాన కాలువల పూడికతీత పనులను ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాజు, తదితరులు ఉన్నారు.

ఘనంగా బలరామ జయంతి

కొల్లిపర: భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో మండల కేంద్రం ప్రధాన కూడలిలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద శుక్రవారం భగవాన్ బలరామ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. భగవాన్ బలరాముడు వ్యవసాయానికి అధిష్టాన దేవుడని తెలిపారు. ఆయన జయంతిని రైతు దినోత్సవంగా నిర్వహిస్తామని అన్నారు. అనంతరం బలరాముడు వ్యవసాయంలో చేసిన నూతన పద్ధతులు, ఆయన జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ రాష్ట్ర సభ్యులు వంగా సాంబిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొండా కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బద్దిగం నాగిరెడ్డి, సభ్యులు శివనాగ మల్లేశ్వరరావు, మునగాల రామారావు, వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పత్రాలు లేని వాహనాలకు జరిమానా



తెనాలి రూరల్: పత్రాలు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించామని తెనాలి మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు తెలిపారు. శుక్రవారం తెనాలి, గుంటూరు-2 ఆర్టీసీ డిపోల ట్రాఫిక్ సూపర్‌వైజర్లతో కలిసి చేబ్రోలు మండలం నారాకోడూరు కూడలి వద్ద ఆయన వాహనాల తనిఖీలు చేపట్టారు. మొత్తం 35 వాహనాలను తనిఖీ చేసి 7 కేసులను నమోదు చేశామని అన్నారు. పత్రాలు లేని వాహనాల యజమానులు, లైసెన్సు లేకుండా వాహనం నడుపుతున్న వారికి మొత్తం రూ.36,500 జరిమానా విధించామని రాఘవరావు పేర్కొన్నారు.

వైభవంగా కోటి పడగల పుణ్య క్షేత్రం మహోత్సవం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కోనేటిపురం కోటి పడగల పుణ్య క్షేత్రమైన శ్రీ వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వస్వామి వారి దేవస్థానం షష్టిపూర్తి వార్షిక కార్యక్రమ మహోత్సవాన్ని శుక్రవారం బాలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ.. సకల మానవుల దోషాలు తొలగించి సుఖశాంతులు కలిగే నాగదేవత స్వామి ఆవిర్భవించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏటా వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెల్లవారు జామున ఉదయం ప్రభాత సేవ, నాగదేవతకు అభిషేకములు, అర్చనలు, అష్టోత్తర శత నామ పూజలు జరిపారు. కార్యక్రమాలను వంగర చలమయ్య సిద్ధాంతి, జొన్నా వెంకట రత్నం గురుస్వాములు పర్యవేక్షించారు. భజన భక్త సమాజం నిర్వహించిన కోలాటంలో భక్తులు పాల్గొన్నారు. చుట్టుపక్కల భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయగా వారికి అన్నదానం నిర్వహించారు.

దమ్ము చక్రాలు రోడ్లపై నిషేధం



నగరం: దమ్ము చక్రాల ట్రాక్టర్లు రోడ్లపై ప్రయాణించడం వల్ల రోడ్లు దెబ్బ తింటున్నాయని డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ టి.కె. పరంధామ రెడ్డి తెలిపారు. నగరం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి ట్రాక్టర్ యజమానులతో మాట్లాడారు. వరి నాట్లు సీజన్‌లో ఎక్కువగా ట్రాక్టర్ యజమానులు ఈ పొరపాటు చేస్తున్నారని.. పొలం గట్టు వరకూ సాధారణ టైర్లతో ప్రయాణించి పొలంలో దిగే ముందు దమ్ము చక్రాలను మార్చుకోవాలని.. పని ముగిసిన వెంటనే తిరిగి సాధారణ టైర్లను మార్చుకుని మాత్రమే రోడ్ల పైకి రావాలని ఆయన కోరారు. తప్పని సరి పరిస్థితుల్లో, తక్కువ దూరం ప్రయాణించేటప్పుడు సేఫ్టీ మెటల్ రింగ్‌ను వినియోగించాలని సూచించారు. దమ్ము చక్రాలతో రోడ్ల మీద పట్టుబడితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రెండు ట్రాక్టర్లకు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

హౌసింగ్‌లో ఇళ్ల డాక్యుమెంట్‌లు మాయం

- రుణాలు చెల్లించకుండానే లబ్ధిదారులకు చేరిన డాక్యుమెంట్‌లు
- చేతివాటం ప్రదర్శించిన పలువురు ఉద్యోగులు
- అంతర్గతంగా విచారణ జరుపుతున్న అధికారులు



తెనాలిలోని గృహనిర్మాణ శాఖ కార్యాలయం

తెనాలి అర్బన్: గృహనిర్మాణ శాఖలో అవినీతికి అంతులేకుండా పోతోంది. కొందరు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తూ... నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా కార్యాలయంలో భద్రపరిచిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లను మాయం చేస్తున్నారు. ఇటీవల ఇది వెలుగు చూడడంతో అధికారులు అప్రమత్తమై అంతర్గత విచారణ జరుపుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తెనాలి నియోజకవర్గ పరిధిలో తెనాలి పట్టణం, తెనాలి, కొల్లిపర మండలాలు ఉన్నాయి. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా కొంత ఆర్థిక సాయం చేస్తుంది. అంతే కాకుండా వారికి అవసరమైన ఇంటి మెటీరియల్‌ను కూడా పంపిణీ చేస్తుంది. అర్హులైన వారు తెనాలి కొత్తపేటలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయంను సంప్రదించి దరఖాస్తు చేసుకునే వారు.

అర్హులకు ప్రభుత్వం రుణాలు..

అర్హులకు ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు రుణాలు ఇచ్చేది. వాటిలో కొంత సబ్సిడీ కింద పోగా మిగిలిన నగదును చెల్లించాల్సి ఉండేది. ఎంపికైన లబ్ధిదారులు తమ ఇంటి రిజిస్టర్ డాక్యుమెంట్‌లను తప్పని సరిగా గృహనిర్మాణ శాఖ అధికారులకు అందజేసి రుణాలు తీసుకోవాల్సి ఉండేది. 1986 నుంచి 2006 వరకు తెనాలి నియోజకవర్గంలో సుమారు 700 మంది రుణాలు తీసుకున్నారు. భవన నిర్మాణ ఖర్చులు పెరగడంతో ప్రభుత్వం రూ.35 వేలు, రూ.50 వేలు వరకు రుణాలు ఇచ్చింది. 2006 నుంచి 2012 వరకు 200 మంది రుణాలు తీసుకున్నారు. వీరు కూడా తమ ఇంటి డాక్యుమెంట్‌లను గృహనిర్మాణ శాఖ అధికారులకు ఇచ్చి రుణాలు పొందారు.

కనిపించని డాక్యుమెంట్‌లు..

సదరు ఉద్యోగి డాక్యుమెంట్‌లను పరిశీలించగా అవి కనిపించలేదు. దీనిపై ఆరాతీయగా ఒక అధికారి చేతివాటం ప్రదర్శించి ప్రభుత్వానికి నగదు చెల్లించకుండా లబ్ధిదారునికి డాక్యుమెంట్‌లు ఇచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. విషయాన్ని ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లడంతో అధికారులు అప్రమత్తమూ గోప్యంగా విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. అలాగే రికార్డులు భద్రపరిచిన గది తాళాలను కూడా ఈఈ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇలా అనేక మంది లబ్ధిదారులకు రుణాలు చెల్లించకుండా డాక్యుమెంట్‌లు ఇచ్చేసినట్లు సమాచారం. దీని వెనుక ఎవరు ఉన్నారనే కోణంలో అంతర్గత విచారణ జరుపుతునట్లు తెలిసింది. ఈఈ వై.భాస్కరరావును దీనిపై వివరణ కోరగా.. రికార్డు గది తాళాలు తాను తీసుకున్న మాట వాస్తవమన్నారు. రుణాలు చెల్లించకుండా డాక్యుమెంట్‌లు ఇచ్చినట్లు తన దృష్టికి రాలేదన్నారు. వెంటనే విచారణ జరుపుతామని చెప్పారు.

వెలుగు చూసింది ఇలా..

1986 నుంచి 2012 వరకు గృహనిర్మాణ శాఖ ద్వారా రుణాలు తీసుకున్న లబ్ధిదారులు నగదును వాయిదాల పద్ధతిలో.. ఒకే సారి డీడీల రూపేణా మాత్రమే నగదు చెల్లించానే నిబంధన ఉంది. ఇలా రుణాలు తీసుకోని చెల్లించని వారికి కార్యాలయంలోని ఉద్యోగులు ఫోన్‌లు చేసి వాటిని చెల్లించమని కోరారని సమాచారం. లబ్ధిదారులు అందుబాటులో లేకపోతే ఉద్యోగులే వారి ఇళ్లకు వెళ్లి రుణాలు చెల్లించాలని కోరుతుంటారు. ఇలా జరుగుతుండగా తెనాలి మండలం గుడివాడ గ్రామానికి చెందిన ఓ లబ్ధిదారుని ఇంటికి ఉద్యోగి వెళ్లి రుణాలు చెల్లించాలని కోరాడు. తాను ఓ అధికారి ద్వారా నగదు చెల్లించానని.. తన డాక్యుమెంట్ కూడా తనకు అందజేశారని తెలిపాడు. అనుమానం వచ్చిన సదరు ఉద్యోగి కార్యాలయంకు వచ్చి పరిశీలించగా వేరే వ్యక్తి చెల్లించిన డీడీని ఇతని ఫైల్‌లో పెట్టినట్లు నిర్ధారణ అయింది.

ఘనంగా గణపతి పూజలు.. నిమజ్జనాలు



కొల్లిపరలోని వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, వేమూరు సమన్వయకర్త అశోక్‌బాబు

- ప్రారంభమైన ఊరేగింపు కార్యక్రమాలు
- వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, వేమూరు సమన్వయకర్త అశోక్‌బాబు



ప్రగడకోటయ్యనగర్ గణేష్ ఉత్సవాల్లో డీఎస్పీ జనార్ధనరావు



పూజల్లో పాల్గొన్న చిన్నారులు

కొల్లిపర: వినాయక చవితి వేడుకలు మూడో రోజూ కొనసాగాయి. భక్తులు పిండి వంటలు చేసి ఏకదంతుడికి నైవేద్యంగా సమర్పించారు. భజనలు, భక్తి పాటలతో మండపాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పలు ప్రాంతాల్లో పార్వతీ తనయుడిని శుక్రవారం ఘనంగా ఊరేగించి గంగమ్మ ఒడికి చేర్చారు. మేళతాళాలు.. డీజే పాటన నడుమ గణపతి గ్రామోత్సవం కనులపండువుగా సాగింది. మండపాలల్లో కొలువుదీరి ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులు పిన్నమ్మ చెంతకు చేరుతున్నారు. బొజ్జ గణపతిని పురవీధుల్లో ఊరేగిస్తూ సమీపంలోని కృష్ణమ్మ ఒడికి నిమజ్జనానికి తరలిస్తున్నారు. కొల్లిపరలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి తెనాలి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తుల సమక్షంలో విగ్రహ ఊరేగింపును శివకుమార్, అశోక్‌బాబు ప్రారంభించారు.

తెనాలి అర్బన్: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా శివగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఇస్లాంపేటలోని కృష్ణ బలిజ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమకు శుక్రవారం పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. నాలుగేళ్ల నుంచి వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోలా జగదీష్, అన్నం వాసు, శేఖర్, గంజి సాయి, దుర్గారావు, రామారావు, ఫణీ, కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి: పట్టణ ప్రగడకోటయ్యనగర్‌లో పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో 30వ వార్షిక గణేష్ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అన్నప్రసాద వితరణ చేశారు. తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ముఖ్యఅతిథిగా హాజరై అన్నదానం ప్రారంభించారు. రూరల్ మండల గ్రామం కఠెవరంలో ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పుట్టా రవికిషోర్, గోనుగుంట్ల కన్నయ్య, శ్రీకృష్ణ, తోట పానకాలు, నాగం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తెనాలి బాలాజీరావుపేటలోని అల్లం బ్రదర్స్, జైగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన గణేష్ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గణపతి ఊరేగింపును ఘనంగా నిర్వహించి నిమజ్జనం చేశారు.

గిడుగు రామమూర్తికి నివాళులు



రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలువురు

తెనాలి: విశ్వసాహితీ కళావేదిక, అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయంలో గిడుగు రామమూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సభకు రంగిసెట్టి రమేష్ అధ్యక్షత వహించారు. రామమూర్తి జీవిత విశేషాలు, తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన కృషిని పలువురు వివరించారు. బొల్లిముంత కృష్ణ, పెద్దీటి యోహాను, వెలగా సుభాష్‌చంద్రబోస్, బెల్లంకొండ వెంకట్, శ్రీదేవి, అలపర్తి వెంకటేశ్వరరావు, రఘునాథరావు, వి.భీమేశ్వరరావు, కొప్పరపు విజయసారధిలు గిడుగు తెలుగు భాషకు చేసిన సేవలపై మాట్లాడారు. కవయిత్రి కొలకలూరి దేవికారాణి రచించిన 'స్వప్న వేణువు' కవితా సంపుటిని సభలో ఆవిష్కరించారు. ఆ కవితా సంపుటి విశేషాలపై పలువురు మాట్లాడారు. గిడుగు మనవరాలైన క్రాంతికృష్ణ పంపిన సందేశాన్ని రంగిసెట్టి రమేష్ చదివి వినిపించారు. వినుకొండ శ్రీరామమూర్తి, గాయని మౌనిక, పలువురు రచయితలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు తెలుగు భాషా పురస్కారం



పురస్కారం కార్యక్రమంలో సుభాష్‌చంద్రబోస్

తెనాలి: తెలుగు భాషోద్యమ సమితి నిర్వహణలో గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ విశ్రాంత సీఈవో దైవాల సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రాంధిక భాష నుంచి ప్రస్తుతం మనం మాట్లాడుకునే వ్యవహారిక భాషగా తెలుగు భాషను అభివృద్ధి చేసిన గిడుగు రామమూర్తి జన్మదినాన్ని తెలుగు భాషా దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినట్లు గుర్తుచేశారు. తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే ఉండాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగులోనే లావాదేవీలు జరగాలని, సచివాలయంలో తెలుగు భాషా వికాసానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పాఠశాల బాధ్యులు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు వెలగా సుభాష్ చంద్రబోస్‌కు తెలుగు భాషాదినోత్సవ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు చక్రవర్తి స్వాగతం పలుకగా.. ఉపాధ్యాయులు హనుమానాయక్, సాంబశివరావు, శివబసవమ్మ, మల్లీశ్వరి, రాజ్యలక్ష్మి, సాజిదా పర్వీన్ పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో మరో ఉద్యమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

రేపల్లె: బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ భారాలపై మరో ఉద్యమాన్ని కొనసాగిస్తామని.. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐ(ఎంఎల్), సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం తాలూకా సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం ముందు ప్రతిజ్ఞ నిర్వహించారు. బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో పోలీస్ కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలా చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టండని పిలుపునిచ్చిన కూటమి నాయకులు.. నేడు విద్యుత్ ఛార్జీలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో ఆగస్టు 28న తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన పోరాటానికి 25 ఏళ్లు గడిచాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంపు భారం చూస్తుంటే ఇప్పుడు పెంచుతున్న విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ మరోసారి వామపక్షాల ఆధ్వర్యంలో పోరాటానికి ప్రజలు సిద్ధమవుతున్నారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)నాయకులు ఎం.శోభారాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సీపీఎం నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్, సీపీఐ ఎంఎల్ నాయకులు ఎం.ఈశ్వరరావు, సుబ్బారావు, డీవైఎఫ్ఐ యువజన సంఘం రేపల్లె ఏరియా కమిటీ అధ్యక్షులు సీహెచ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ సంస్కరణలు ఉపసంహరించాలని, విద్యుత్ అమరవీరుల ఆశయాలను సాధిస్తామని, కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడుతామని, విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లకి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

రీ సర్వే పూర్తి చేసేందుకు చర్యలు

వేమూరు: రీ సర్వే పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ సుశీల తెలిపారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో రెండో విడత రీ సర్వే చేయనున్నామని అన్నారు. సెప్టెంబరు నెల చివరకు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మొదటి విడత వరహాపురంలో పూర్తి చేశామని అన్నారు. రెండో విడత పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. రీ సర్వేలో రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తామన్నారు. రైతులు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చుండూరు(వేమూరు): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ జనరల్ మేనేజరు రాజేష్ కుమార్ మహనా తెలిపారు. చుండూరు మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల గురించి ప్రతి గ్రామ పంచాయతీలో క్యాంప్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్, ఏసీఎం, పి.ప్రభాకర్, నూపాం గోష్, ప్రటీన్, బీవీఎస్ స్వామి, పీవీ శ్రీనివాసరావు, పి.జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

డీజేకి పర్మిషన్ ఇవ్వాలని గ్రామస్తుల ధర్నా



అల్లూరు(కర్లపాలెం): వినాయక నిమజ్జన ఊరేగింపులో డీజే బండికి పర్మిషన్ ఇవ్వాలని అల్లూరు గొడపాలెం గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గొడపాలెం గ్రామస్తులందరూ వినాయక చవితి సందర్భంగా గ్రామంలో ప్రత్యేకంగా వేసిన పందిరిలో గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మూడో రోజు ఉదయం స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు డీజే బండి ఏర్పాటు చేశారు. గ్రామోత్సవానికి బయలుదేరుతున్న సమయంలో పోలీసులు వచ్చి డీజే బండికి అనుమతి లేదని డీజే బండి లేకుండా నిమజ్జనం చేసుకోవాలని గ్రామస్తులకు చెప్పారు. దీంతో గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ ఎంవి శివకుమార్ యాదవ్ గ్రామస్తుల వద్దకు వచ్చి డీజే బండికి ఎస్పీ అనుమతులు లేవని.. మైక్ సెట్ ఏర్పాటు చేసుకుని నిమజ్జనం చేసుకోవాలని గ్రామస్తులకు నచ్చచెప్పడంతో వారు నిరసన విరమించారు.

దోమల నియంత్రణకు చర్యలు

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ



ర్యాలీలో పాల్గొన్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ

తెనాలి అర్బన్: దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో జయప్రకాష్ నగర్‌లో దోమల నియంత్రణ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవగాహనతోనే దోమల నియంత్రణ సాధ్యమన్నారు. ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటిలో దోమల ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. దోమకాటు వల్ల జ్వరాలు, మలేరియా, డెంగీ, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, అందె బాలచంద్రమౌళి, వంగాల పున్నారెడ్డి, శివగణేష్, జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, తిరువీధుల శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినీలు

తెనాలి అర్బన్: మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ శాంతి పేర్కొన్నారు. కళాశాల, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మత్తు పదార్థాల విముక్తి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల అనేక అనార్థాలు ఉన్నాయన్నారు. వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. హెచ్ఐవీ పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాల కౌన్సిలర్ మహ్మద్ రఫీ, వివిధ సంస్థల కౌన్సిలర్లు టి.రజిని, కె.సులోచన, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ ఎం.వనజ, డాక్టర్ కె.నిర్మల జ్యోతి, కె.చిన్నారి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

తెనాలి అర్బన్: హెచ్ఐవీ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాలలోని ఐసీటీసీ కౌన్సిలర్ రఫీ పేర్కొన్నారు. చేయూత వెల్ఫేర్ హెచ్ఐవీ ఎంపవర్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సెయింట్ పీటర్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో హెచ్ఐవీపై శుక్రవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధి అంటు వ్యాధి కాదని.. అంటించుకునే వ్యాధి అని తెలిపారు. సమావేశంలో సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ రామకృష్ణ, ఫీరోజ్, రామలక్ష్మీ, ఎస్తేరు, తదితరులు పాల్గొన్నారు.